





సూపర్ బ్లూ మూన్

వినీలాకాశంలో చంద్రుడు కనువిందు చేశాడు. నీలి జాబిలి ప్రకాశవంతంగా వెలిగిపోయింది. ఒంగోలులో సోమవారం రాత్రి గం॥11.56ని॥ ఆవిష్కృతమైన అద్భుత దృశ్యాలు. – సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

శిలాఫలకాలు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మండలంలోని కరవదిలో గుర్తు తెలియని దుండగులు రెచ్చిపోయారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో కరవది సూపర్ మార్కెట్ వద్ద మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేసిన ఆయనే ప్రారంభోత్సవం చేశారు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొందరు దుండగులు పగులగొట్టి విధ్వంసం చేశారు. అలాగే కవరది మహిళా మండలి సెంటర్ వద్ద కరవది–గుండాయిపాలెం, కరవది–చేజర్ల, కరవది–చేజర్ల వయా ఉలిచి రోడ్ల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు సంబంధించిన శిలాఫలాకాలను సైతం దుండగులు ధ్వంసం చేయడమే కాకుండా ముక్కలు ముక్కలు చేశారు. పొక్లెయినర్ ద్వారా వీటిని ధ్వంసం చేసి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు. అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలతో గ్రామస్తులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భయాందోళనకు గురవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా భయపడిపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు.

జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు దొర్నాల విద్యార్థులు



జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయలక్ష్మి, షేక్ ఆసిఫా, కృష్ణవేణి బాయి, రిషి జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28వ తేదీ నంద్యాల జిల్లా ప్రమదానంది ఆలయంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 12 నుంచి 14 వ తేదీ వరకు మహారాష్ట్ర లోని నాందేడ్‌లో జరిగే రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓ మస్తాన్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ ఖాదర్‌వలి, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, హెచ్.రామానాయక్, నాగమూర్తి, యోగా మాస్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు అభినందలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల విద్యా ఉపాధికి బడ్జెట్ నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవ కుమార్

ఒంగోలు టౌన్: ఎస్సీ, ఎస్టీల విద్యా, ఉపాధి కోసం బడ్జెట్‌లో నిధులు పెంచాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ అల్లడి దేవ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 12 వేల సీట్లు అందుబాటులో ఉండగా ప్రతి ఏడాది 39 వేల దరఖాస్తులు వస్తున్నాయని, ఈ లెక్కన ఏడాదికి 27 వేల మంది విద్యార్థులు గురుకులాల్లో చదువుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 కొత్త గురుకులాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా రూ.20 వేల పంటనష్ట పరిహారం అందజేయాలని వాచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బి.రమణ మూర్తి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర యానాది సంఘం నాయకులు ఈగ శ్రీనివాసరావు, కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి రఘురాం, గుత్తి కోటేశ్వరరావు, గుంటూరు నాగమణి, గుమ్మళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో అంతా మాయే..!

కొండపి నియోజకవర్గంలో అంతా మాయ.. లేని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మట్టి తరలించేస్తుంటారు.. ఇసుక పాయింట్ ఉన్నా.. అది కాదని మంత్రి గారి సొంతూరులో సిమెంట్ రోడ్డు నిర్మాణం పేరుతో వాగులు, వంకలూ కొల్లగొట్టేస్తున్నారు. యంత్రాలతో సహజ వనరుల్ని ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. రేయింబవళ్లు ట్రక్కులు, ట్రాక్టర్లలో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించేస్తూ జేబులు నింపుకుంటున్నారు. విచ్చలవిడిగా దందా జరుగుతున్నా మంత్రిగారి ఇలాకా కదా అని మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకునే సమయం లేనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



టంగుటూరు మండలం నాయుడుపాలెంలో గ్రావెల్ తోలిన ప్రాంతం

- యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ దందా
- సహజవనరుల్ని అడ్డగోలుగా దోచేస్తున్నారు
- లేని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గ్రావెల్ అక్రమ రవాణా
- సిమెంటు రోడ్ల నిర్మాణం అంటూ ఇసుకకు అనధికార అనుమతులు
- ఒంగోలుకు వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న మైనింగ్, పోలీస్, సెబ్, రెవెన్యూ అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఈ అక్రమ దందా జోరుగా సాగుతోంది. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలంలో ఇసుక, టంగుటూరు మండలంలో గ్రావెల్ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో ఇసుక తవ్వకాల విషయంలో అధికార పార్టీలోని ముఖ్యనేతల అనుచరుల మధ్య గట్టి వారే నడిచింది. నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం భూముల్లో గ్రావెల్ తవ్వకాల సమయంలో వివాదం చెలరేగి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కే వరకూ వెళ్లింది. ఇది మరిచిపోక ముందే కొత్త దందా వెలుగులోకి వచ్చింది. అక్రమాల లోతును తవ్వుతుంటే విస్తుపోయే అంశాలు వెలుగుచూస్తున్నాయి.

లేని సబ్‌స్టేషన్ కోసం మట్టి..

టంగుటూరు మండలం మర్లపాడు, కందులూరు, కొణిజేడు ప్రాంతాల్లోని దిబ్బల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇష్టారాజ్యంగా మట్టిని తరలించేస్తున్నారు. ఈ మట్టి ఎక్కడకు తరలిస్తున్నారని ఆరా తీస్తే మంత్రిగారి స్వగ్రామం టంగుటూరు మండలం నాయుడుపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసమని చెబుతున్నారు. మరింత లోతుగా వివరాలు సేకరిస్తే అసలు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలే లేవని తేలింది. మరి ఈ మట్టి ఎక్కడికి తరలిపోతుందో అధికార పార్టీ నేతలకే తెలియాలి.

సిమెంటు రోడ్డు పేరుతో ఇసుక దందా..

నాయుడుపాలెంలో వచ్చే నెల 22వ తేదీ మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవానికి అధికార పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. దీని నిర్మాణం నిమిత్తం ఇసుక కోసం అనుమతులు తీసుకున్నారు. ఈనెల 17 నుంచి 20 వ తేదీ వరకు 50 ట్రిప్పులు తోలుకోవటానికి అధికారులు అనుమతి ఇచ్చారని తెలిసింది. ఇసుక రవాణాకు సంబంధించి అనుమతిచ్చిన ట్రాక్టర్ నంబర్లను అధికారులు పోలీసులకు ఇచ్చారని తెలిసింది. ఇక్కడ వరకూ పైకి అంతా బాగానే జరుగుతుందని అనిపించినా లోన మాత్రం వందలాది ట్రాక్టర్లు అక్రమంగా ఒంగోలు నగరానికి తరలించి జేబులు నింపుకుంటున్నారు. వాస్తవానికి 50 ట్రాక్టర్ల ఇసుకకు కేవలం ఒక్క రోజే అనుమతి సరిపోతుంది. కానీ నాలుగు రోజులు ఎందుకు అనుమతులు ఇచ్చారో అన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే టంగుటూరు టోల్ గేట్ వద్ద రాత్రి వేళల్లో సెబ్, విజిలెన్స్, మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ సమయంలో తమ కళ్ల ముందు నుంచి అక్రమంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్లను మాత్రం ఆపటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పట్టపగలు టంగుటూరు టోల్ గేట్ మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

ఒకవైపు హెచ్చరిస్తున్నా..

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్, ఎస్పీ చెబుతున్నా దందాకు అడ్డుకట్ట పడటం లేదు. విచ్చలవిడిగా సహజ వనరులను దోచేస్తున్నారు. ఇటీవల సింగరాయకొండ పోలీసులు ఇసుక ట్రాక్టర్ల యజమానులను సమావేశం నిర్వహించారు. ఇసుక తరలింపులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయితే కింద స్థాయి సిబ్బంది మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతోందన్న ఆరోపణలున్నాయి.

మొక్కుబడిగా దాడులు

ఇసుక, మట్టి అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సిబ్బంది కొరతతో అల్లాడిపోతున్నాం.. దాడులు చేయలేక ఇబ్బంది పడుతున్నామని సెబ్ అధికారులు చెబుతున్నారు. మరో పక్క రెవెన్యూ, పోలీస్ అధికారులు సైతం మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తూ మమ అనిపిస్తుండడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు.

ఇసుక తరలింపులో అన్నీ ట్విస్టులే..

సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఇసుక తరలింపులో అన్నీ ట్విస్టులే. వాస్తవంగా ఇసుక రవాణాకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదని ట్రాక్టర్ల యజమానులే చెబుతున్నారు. జరుగుమల్లి మండలంలోని సతుకుపాడు ఇసుక స్టాక్ పాయింట్ ఇక్కడ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్దేశించిన ధర చెల్లించి ఇసుకను తీసుకువెళ్లొచ్చు. అయితే అధికారికంగా ఎలాంటి స్టాక్ పాయింట్లు, రీచ్‌లు లేని కె.బిట్రగుంట, జరుగుమల్లి, చింతలపాలెం, కామేపల్లి ప్రాంతాల్లో ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎలా ఇచ్చారో? అధికారులకే తెలియాలి. టంగుటూరులో అయితే ట్రాక్టరు ఇసుక రూ.1,500కు ఇస్తుండగా, ఒంగోలులో రూ.4 వేలకు అమ్ముతున్నారు. నాయుడుపాలెం వరకూ అనుమతులు తీసుకుని, వందల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుకను ఒంగోలులో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



వల్లూరు ఫ్లై ఓవర్ వద్ద అక్రమంగా తరలి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

బయ్యర్‌లు సిండికేట్

- నష్టాల్లో త్రీ సెం.మీ గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు
- ఒక్కో కంటైనర్‌కు రూ.70 వేల వరకు ఫ్యాక్టరీ యజమానికి నష్టం
- నెలకు సుమారు 200–300 ఫ్యాక్టరీల వరకు లోడింగ్
- సిండికేట్ అయిన బయ్యర్ కంటైనర్‌ను అడ్డగింత
- గిట్టుబాటు ధర ఇవ్వాలని ఫ్యాక్టరీల యజమానుల ఆందోళన



త్రీ సెం.మీ గ్రానైట్ లోడు కంటైనర్‌ను అడ్డుకుంటున్న ఫ్యాక్టరీల యజమానులు

చీమకుర్తి: త్రీ సెం.మీ గ్రానైట్ పీస్‌లను లోడు చేస్తున్న కంటైనర్‌ను త్రీ సెం.మీ గ్రానైట్ యజమానుల సంఘం వారు అడ్డుకున్నారు. చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం, సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక సమీపంలోని త్రీ సెం.మీ గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద లోడింగ్ జరుగుతున్న కంటైనర్‌లను సోమవారం త్రీ సెం.మీ ఫ్యాక్టరీల సంఘం అడ్డుకుంది. బయ్యర్‌లు సిండికేట్ కావడం వలన ఒక్కో పీస్‌కు రూ.73 చెల్లించాల్సి ఉంటే స్పాట్ క్యాష్ అయితే రూ.56, అప్పు అయితే రూ.63 వంతున చెల్లించి బయ్యర్‌లు తీసుకెళ్తున్నారు. దాని వలన ఒక్కో కంటైనర్‌కు రూ.70 వేల వంతున నష్టం వస్తుందని త్రీ సెం.మీ ఫ్యాక్టరీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. నెల నెలా దాదాపు 200 నుంచి 300 కంటైనర్‌లు లోడు చేసుకొని సిండికేట్ అయిన బయ్యర్‌లు ఫ్యాక్టరీల యజమానుల ఆదాయానికి గండికొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల నెలా 300 ఫ్యాక్టరీలకు ఒక్కో దానికి రూ.70 వేల వంతున రూ.2 కోట్ల మేర ఫ్యాక్టరీల యజమానుల లాభాలను బయ్యర్లు కొల్లగొడుతున్నట్లు అంచనా. మెట్లకు ఉపయోగించే స్టెప్ రాళ్లు, రేజర్ పీస్‌లను 3 సెం.మీ మందంతో కోసే గ్రానైట్ ఫ్యాక్టరీలు చీమకుర్తి, మర్రిచెట్లపాలెం, బూదవాడ, గుండ్లాపల్లి పరిధిలో సుమారు 75 వరకు ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసే బయ్యర్‌లు సిండికేట్ కావడం వలన తమకు రావాల్సిన లాభాలు కోల్పోతున్నామని ఫ్యాక్టరీల యజమానులు వాపోతున్నారు. ఇప్పటికే ప్రతి ఫ్యాక్టరీ యజమాని వద్ద కొనుగోలు చేసిన త్రీ సెం.మీ రాళ్లకు రావాల్సిన డబ్బులను 6 నెలల వరకు బయ్యర్లు పేమెంట్స్ చేయకపోవడంతో ఫ్యాక్టరీల యజమానులు చేసేది లేక ఇప్పటి వరకు సర్దుకుపోయారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇటీవల త్రీ సెం.మీ ఫ్యాక్టరీల యజమానులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం దానికి సంబంధించిన కార్యాలయాన్ని బూదవాడ సమీపంలో ఏర్పాటు చేస్తున్నారు. అదే సమయంలో బయ్యర్‌లకు చెందిన ఒక కంపెనీ యజమాని అసోసియేషన్ నియమాలను పట్టించుకోకుండా తనకు అనుకూలంగా ఉన్న ఫ్యాక్టరీ వద్ద త్రీ సెం.మీ రాళ్లను లోడు చేసుకుంటుంటే దానిని ఫ్యాక్టరీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకొన్నారు. తమకు గిట్టుబాటు ధర ఇచ్చి తీసుకుపోవాలని ఫ్యాక్టరీల యజమానులు ఎం.రామారావు, సురేష్, ప్రసాద్, ఫణీంద్ర, శ్రీనివాసరావు తదితరులు స్పష్టం చేశారు.

ఏకేయూలో.. ర్యాగింగ్ దూరం



ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వీసీని ఆహ్వానిస్తున్న ఏకేయూ విద్యార్థులు

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: ర్యాగింగ్ లేని సమాజంగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుదామని వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం యూనివర్శిటీలో నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పీజీ సెంటర్‌గా ఉన్నా, యూనివర్శిటీగా ఉన్నా ర్యాగింగ్ దరిచేరని విద్యానిలయంగా ఉండడం హర్షించదగ్గ అంశం అన్నారు. ప్రైవేటు, పబ్లిక్ స్థలాల్లో మహిళతో అనుచితంగా మాట్లాడడం, అసభ్యకరంగా వ్యవహరించడం నేరం అని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ కాలేజీల్లో ఒకప్పుడు సరదాగా జరిగే పరచయ కార్యక్రమాలు నేడు వికృత చేష్టలకు నిలయంగా మారడం వల్ల బాలికలు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ అంచుల భారతీదేవి మాట్లాడుతూ ర్యాగింగ్ భూతాన్ని మొగ్గ దశలోనే తుంచి వేసేందుకు ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించారు.

27 నుంచి ఎఫ్‌ఏ–1 పరీక్షలు

ఒంగోలు: ఈనెల 27 నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించాలని డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు సూచించారు. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు 1 నుంచి 5 తరగతులకు పూర్తిచేయాలన్నారు. 6 నుంచి 10 తరగతులకు సెప్టెంబర్ 4వ తేదీలోగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏ తేదీన ఏ పరీక్ష నిర్వహించాలనే దానిపై ఒక షెడ్యూలును కూడా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించారు.

జూడాల ఉద్యమం మరింత ఉధృతం



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న జూనియర్ డాక్టర్లు

- రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన జూడాలు

ఒంగోలు టౌన్: కోల్‌కతాలోని కార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ఆందోళన బాట చేపట్టిన జూనియర్ వైద్యుల ఉద్యమం మరింత ఉధృతమైంది. న్యాయం చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామంటూ నిరసనలకు దిగిన జూనియర్ వైద్యులు సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన దీక్షా శిబిరం వద్దకు వివిధ ప్రజా సంఘాల నాయకులు తరలి వచ్చి తమ మద్దతు తెలియజేస్తున్నారు. స్త్రీ విముక్తి సంఘటన, జనసాహితి, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐలు కార్ వైద్యశాలలో జరిగిన దారుణాన్ని నిరసిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు కదంతొక్కారు. సాయంత్రం దీక్షల తరువాత గాంధీ పార్కుకు చేరుకున్న జూనియర్ డాక్టర్లు వివిధ కార్యక్రమాల ద్వారా తమ పోరాటంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం, అనంతరం దేశ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చేపట్టిన పోరాటాలను పార్కులోని 35 ఎంఎం స్క్రీన్‌పై ప్రదర్శించారు.

కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు, మహిళా వైద్యులపై నిరంతరం జరుగుతున్న అత్యాచారాలపై కఠిన చట్టాలు తీసుకొని రావాలన్న డిమాండ్ తో పోరాటం కొనసాగిస్తున్నామని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ డా.అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. అనివార్య పరిస్థితుల్లో తాము విధులు బహిష్కరించాల్సి వచ్చిందని వివరించారు.

పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా సేవలందించాలి

- డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఒంగోలు టౌన్: పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందించేలా ప్రజలకు సేవలందించాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు సూచించారు. తిరుపతి శ్రీసిటీ నుంచి విజయవాడకు వెళ్తూ మార్గమధ్యంలో ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, పోలీసు సిబ్బంది సంక్షేమంపై తీసుకుంటున్న చర్యలను ఎస్పీ వివరించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్‌ను డీజీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీసు అధికారులు నిబద్ధతగా పనిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో పారదర్శకత, జవాబుదారితనం పాటించాలన్నారు. జిల్లాలోని సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలన్నారు. నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే జిల్లాపై పట్టు సాధించడం, పోక్సో కేసులకు సంబంధించి సత్వరమే చర్యలు తీసుకోవడంపై ఎస్పీని అభినందించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ బీమా నాయక్, ఆర్ఐలు రమేష్, రమణా రెడ్డి, సీతారామి రెడ్డి ఉన్నారు.



డీజీపీకి బొకే అందజేస్తున్న ఎస్పీ దామోదర్

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5న టీచర్స్ డే సందర్భంగా అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని వివిధ కేటగిరీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 23వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారులకు దరఖాస్తులు పంపాలన్నారు. ఎంఈవోలు సంబంధింత దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 25వ తేదీలోగా ఉప విద్యాశాఖ అధికారులకు పంపాలని సూచించారు. వారు మళ్లీ దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 27వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలన్నారు. దరఖాస్తుకు కనీసం 15 సంవత్సరాల బోధన అనుభవం ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణ చర్యలకు లోనై ఉండరాదని తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలి



పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి: రైతులు సాగు చేసే పంటల వివరాలకు సంబంధించిన ఈ క్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ వ్యవసాయాధికారులకు సూచించారు. మండలంలోని మంచికలపాడు గ్రామంలో సజ్జ పంట సాగు చేస్తున్న రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. పంటల సాగు వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ బుకింగ్ గణాంకాలను పరిశీలించారు. ఆయన వెంట డీడీఏ శ్రీనివాసరావు, ఏడీ వెంకట్రావు, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ భాస్కర్‌రావు ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.8.50 లక్షలకు టోకరా

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి కనిగిరి మహిళ ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని కనిగిరి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోసం చేశారని కనిగిరికి చెందిన ఒక మహిళ ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో ఎస్పీని కలిసి ఫిర్యాదు అందజేశారు. నమ్మకంగా తమ వద్ద నుంచి రూ.8.50 లక్షలు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తమ వద్ద నుంచి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని అడిగితే.. నిర్లక్ష్యంగా జవాబు ఇస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అదనపు కట్నం కోసం తన భర్త, అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని కంభం మండలానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 69 ఫిర్యాదులు ఎస్పీకి అందాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ.. న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడారు. తక్షణమే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులోగా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, దిశ సీఐ షేక్ ఖాజావలి, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివ రామకృష్ణ పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్‌లో మార్పులకు రంగం సిద్ధం

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచి సిబ్బందిని పూర్తిగా మార్చేందుకు ఎస్పీ దామోదర్ రంగం సిద్ధం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఎస్బీలో పనిచేస్తున్న సిబ్బందిని వారి పాత స్థానాలకు వెళ్లి రిపోర్టు చేయాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. 8 మంది ఏఎస్ఐలలో కొందరిని సంబంధిత పోలీసుస్టేషన్లలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలుస్తుంది. మరికొందరిని మాత్రం వీఆర్‌కు పంపిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒంగోలు నగరంలో పనిచేస్తున్న ఎస్బీ సిబ్బంది అందరినీ పాత స్థానాలకు పంపించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుదీర్ఘ కాలం నుంచి పలువురు హెడ్ కానిస్టేబుళ్లు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలంగా ఏఎస్ఐలు కూడా ఎస్బీలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్పీగా దామోదర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ఎస్బీలో పనిచేయాలన్న ఆసక్తి కలిగిన హెడ్ కానిసేబుళ్లు, కానిస్టేబుళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తాజా ఉత్తర్వులతో ఆ మేరకు ఎస్పీ కార్యాచరణ చేపట్టినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

బదిలీ ఆగాలంటే.. భవనాలు కూల్చాలి!

- మార్కాపురంలో వైఎస్సార్ సీపీ నేతల భవనాలే లక్ష్యంగా దాడులకు సిద్ధం
- టీడీపీ నేతల సూచనతో రెచ్చిపోతున్న మున్సిపల్ అధికారి
- అధికార పెద్దల ప్రాపకం కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్న వైనం
- ఎన్నికల ఫండ్ ఏం చేశారో స్పష్టత లేదు.. ప్రతి విభాగానికి వసూళ్ల టార్గెట్
- అవినీతి కిరణంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ



మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

మార్కాపురం/మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీలో ఓ అధికారి వ్యవహారం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అత్యంత తక్కువ సమయంలోనే కలెక్షన్ కింగ్‌గా పేరుతెచ్చుకున్న సదరు అధికారి.. టీడీపీ నేతల ప్రాపకం కోసం వైఎస్సార్ సీపీ నాయకుల భవనాలను టార్గెట్ చేయడం ప్రారంభించారు. వార్డు సచివాలయ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి కలెక్షన్ల దందా చేస్తున్న ఆ అధికారి తీరు వివాదాస్పదంగా మారింది. బదిలీ కాకుండా ఇక్కడే కంటిన్యూ కావడం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు కడుతున్న భవనాలను టార్గెట్ చేశాడు. ఆ భవనాలు కూల్చితే ఇక్కడే కంటిన్యూ అవుతావని టీడీపీ నేతలు భరోసా ఇవ్వడంతో కేవలం ఆరుగురు వైఎస్సార్ సీపీ నేతల భవనాలను ఈ అధికారి అక్రమ కట్టడాలుగా గుర్తించి వాటిని కూల్చేందుకు సిద్ధమయ్యాడు. కేవలం టీడీపీ నేతల మెప్పుకోసం గత రెండు నెలల నుంచి ఉద్యోగం చేస్తున్నాడన్న అపవాదు కూడా మూటగట్టుకున్నాడు. ఆ అధికారిపై ఇప్పటికే ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. మార్కాపురం పట్టణంలో సుమారు 20కి పైగా అపార్టుమెంట్లు ఉన్నాయి. మార్కాపురం మున్సిపల్‌కు జీ+2 వరకూ అనుమతిస్తారు. ఆపైన అనుమతుల కోసం మున్సిపల్ హెడ్‌ఆఫీసుకు వెళ్లి అనుమతితెచ్చుకోవాలి. పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. అపార్టుమెంట్ల కల్చర్ ప్రారంభమైంది. ఇప్పటికే సుమారు 20కి పైగా అపార్టుమెంట్లు కట్టారు. వీటితోపాటు పూలసుబ్బయ్య కాలనీ నుంచి ఎస్‌వీకేపీ కళాశాల వరకు రోడ్డును ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. కాలువలను సైతం మూసివేసి షాపులు కట్టారు. ఇవన్నీ ఆ అధికారికి కనిపించలేదు. కేవలం వైఎస్సార్ సీపీ నాయకుల భవనాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

పనికో రేటు

ప్రతి ఫైలుకు లంచం ఇవ్వాల్సిందే. లేదంటే ఏదొక కొర్రిపడి సంతకం కాకుండా వెనక్కు వస్తుంది. బిల్డింగులకు పర్మిషన్ కావాలన్నా.. అపార్టుమెంట్లకు అనుమతులు ఇవ్వాలన్నా.. రేటు ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుంటే సాయంత్రానికి ఫైలు అప్రూవలై వస్తుంది. లేదంటే సుమారు 25 సర్టిఫికెట్లు ఆ ఫైలుకు జత చేయాలని చెబుతారు. వసూళ్ల దందాలో మున్సిపాలిటీలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో బైక్‌పై చక్కర్లు కొడుతూ నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగుల వద్దకు సిబ్బందిని పంపి బేరసారాలు చేయడం రివాజుగా మారింది. సచివాలయ మహిళా ఉద్యోగులను తన చాంబర్‌కు పిలిపించుకుని పనిచేయాలంటూ సతాయించడం, లేదంటే తనతో క్లోజ్‌గా మూవ్ అవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది.

అంతా 'విష్ణుమాయ'

అవినీతి కిరణం విష్ణుమాయలో పడింది. అరుణోదయ స్కూల్ సమీపంలోని సచివాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి తన విధులను మరిచిపోయి మున్సిపల్ కార్యాలయంలో కూర్చుని కమీషన్లు సెట్ చేస్తున్నాడు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రతి అప్లికేషన్ ఈ ఉద్యోగి స్కానింగ్ చేసి రేటు ఫిక్స్ చేసి కమీషన్లను పంచుతున్నాడు. దీంతో మున్సిపల్ కార్యాలయం విష్ణుమాయలో పడిపోయింది. ఈ ఉద్యోగిపై గతంలోనే ఏసీబీకి ఫిర్యాదుచేశారు. అప్పట్లో ఈ ఉద్యోగి వేరే సచివాలయానికి బదిలీ చేయగా కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేత తన పలుకుబడితో మున్సిపాలిటీలో జాయిన్ అయ్యాడు.

ఎన్నికల డబ్బులేమైనట్టు?

ఈ ఏడాది మేలో ఎన్నికల నిర్వహణకు మున్సిపాలిటీకి కేటాయించిన నిధులు ఏమయ్యాయో అర్థం కావడంలేదు. నామినేషన్లు, ఎన్నికల శిక్షణ, పోలింగ్ నిర్వహణ తదితర సందర్భాల్లో భోజనానికి ఓ హోటల్ నిర్వాహకుడు రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. అయితే అతనికి రూ.1.50 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ బాక్సులు ఎత్తడం.. దించడం... కర్రలు పాతడం.. తొలగించడం.. వంటి పనుల్లో పాల్గొన్న కూలీలకు, శానిటేషన్ సిబ్బందికి కూడా ఇంత వరకు సదరు అధికారి డబ్బులివ్వలేదు. దీంతో వారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

మామూళ్లతో మజా..

- పట్టణంలోని దోర్నాల సెంటర్‌లో ఉన్న ఓ షాపు రోడ్డుపైకి వచ్చిందని నెలలో నాలుగైదు సార్లు అక్కడికి వెళ్లి సుమారు 4 నుంచి 5 కిలోల డ్రైఫ్రూట్స్‌ను తెచ్చుకుని డబ్బులివ్వడం లేదు. ఇలా గత నాలుగైదు నెలల నుంచి ఆ అధికారి డ్రైఫూట్స్ ఉచితంగా తీసుకెళ్తడటంతో సదరు వ్యాపారి లబోదిబోమంటున్నాడు.
- తన సొంత కారుకు కూడా మున్సిపల్ పెట్రోల్ వాడుతున్నాడు. శానిటేషన్ విభాగం నుంచి నెలకు సుమారు లక్ష రూపాయలు చెల్లించాలని టార్గెట్ పెట్టాడు.
- ప్రతి రోజూ హోటల్స్ నుంచి తనకు కావాల్సిన టిఫిన్లు, భోజనాలు, నాన్‌వెజ్ ఐటమ్స్ వంతుల వారీగా పంపాలి.
- టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ప్రతి నెలా రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల ముడుపులు అందాల్సిందే.
- చిన్న బిల్డింగు కడుతున్నట్లయితే బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు రూ.50 వేల నుంచి రూ.70 వేలు, పెద్ద బిల్డింగు అయితే రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర, అపార్టుమెంట్ల నిర్మాణానికి రూ.5 లక్షల వరకు ఇవ్వాల్సిందే. ఇలా మున్సిపాలిటీలోని ఒక్కొక్క విభాగానికి తనకు ఇవ్వాల్సిన మామూళ్లను టార్గెట్లు పెట్టి వసూలు చేస్తున్నాడని సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

- గ్రీవెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో సోమవారం మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. నిర్దేశించిన సమయంలో అర్జీలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. ప్రతిరోజూ ప్రజా సమస్యల పరిష్కారానికి కొంత సమయం వెచ్చించాలని సూచించారు. ఏదైనా సమస్యను పరిష్కరించలేని పరిస్థితిలో అర్జీదారుడికి అందుకు గల కారణాన్ని పూర్తిగా వివరించాలన్నారు. ఈ విధమైన చర్యలు తీసుకోవడం వలన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పలుసార్లు ప్రజలు తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షలను తనిఖీ చేసిన ఏకేయూ వీసీ



బీఈడీ పరీక్షలను పరిశీలిస్తున్న ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: బీఈడీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక శర్మ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని సూచించారు. మొత్తం 110 బీఈడీ కాలేజీల్లోని 11,015 మంది విద్యార్థులకు 45 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని మీడియాకు వీసీ తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచిపేరు తీసుకొస్తామన్నారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న విధానాన్ని సైతం నిశితంగా పరిశీలించామన్నారు. వీసీ వెంట ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కేవీఎస్ రాజు, తదితరులు ఉన్నారు.

భారీ తిమింగలం అస్థిపంజరం పరిశీలన...

స్థానిక శర్మ కాలేజీలో ఉన్న భారీ తిమింగలం అస్థిపంజరాన్ని ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి పరిశీలించారు. బీఈడీ పరీక్ష కేంద్రమైన శర్మ కాలేజీలో పరీక్షల తనిఖీ సందర్భంగా జువాలజీ మ్యూజియంలో ఉన్న ఆసియాలోనే అతిపెద్దదైన తిమింగలం అస్థిపంజరానికి సంబంధించిన విశేషాల గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. వీసీ వెంట కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసమూర్తి, కోశాధికారి ఓ నరసింహశాస్త్రి, అధ్యాపకులు ఉన్నారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.358 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం .. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో వేలానికి 10,962 బేళ్లు రాగా, 9,202 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,760 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు.

ఒంగోలులోని రెండు వేలం కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో సోమవారం 134వ రోజు నిర్వహించిన వేలానికి 6,012 బేళ్లు రాగా, 5,140 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 872 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.312.09 పలికింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 128వ రోజు నిర్వహించిన వేలంలో 4,950 బేళ్లు వేలానికి రాగా, 4,062 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 888 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.292.16 పలికింది.

ద్విశతావధానంలో జిల్లా కవులు



కవులు సాహిత్యవేత్తలు సన్మానించిన శ్రీశైలం దేవస్థానం నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: శ్రీశైల మహా క్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గత ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న డాక్టర్ బులుసు అపర్ణ ద్విశతావధానం సోమవారం మధ్యాహ్నం ఘనంగా ముగిసింది. ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అపర్ణ 50 సమస్యలు, 50 దత్త పదులు, 50 వర్ణనలు, 30 ఆశువులు, 20 ఘంటావధానాలని సమర్థవంతంగా పూరించారు. ప్రారంభ సభలో ప్రఖ్యాత సాహితీవేత్త గండ్లూరి దత్తాత్రేయ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆశీస్సులు ఇచ్చారు. అవధాన కార్యక్రమానికి మరొక సాహితీవేత్త డాక్టర్ పేరి రవికుమార్ సంచాలకత్వం వహించారు. ముగింపు సభలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రధానవక్తగా ప్రసంగించారు. అవధాన కార్యక్రమంలో జిల్లాకు చెందినకవులు, సాహితీవేత్తలు దిట్ట కవి శ్రీనివాసాచార్యులు, నెమ్మాని సీతా రామమూర్తి, గణపతిరాజు వెంకట మాల్యాద్రి, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, వడ్లమాను మురళీ మోహన్ పాపిశెట్టి శశి కుమార్ ఈశ్వరి గోపాల రావు, భువనగిరి పురుషోత్తం, సురభి శంకర్ శర్మ, సుబ్బారావు, నిమ్మగడ్డ ప్రసాద్ శర్మ, పృచ్ఛకులుగా పాల్గొని అవధానికి ప్రశ్నలు సంధించారు. మంచి పద్యాలు రాబట్టడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ముగింపు సభలో వీరికి దేవస్థాన ఉపకార్య నిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు గిరిజామణి, ఇతర దేవస్థాన అధికారులు స్వామివారి అనుగ్రహ ప్రసాదాన్ని అందించి అభినందించారు.

మార్కాపురం చెరువులో మట్టి దొంగలు

- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.1000 వసూలు
- పది రోజుల నుంచి రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వకాలు
- తర్లుపాడు టీడీపీ నేతదే కీలకపాత్ర



మార్కాపురం చెరువులో మట్టి తోలడంతో ఏర్పడిన భారీ గొయ్యి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో శతాబ్దాల చరిత్ర కలిగిన చెరువులో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి 8 గంటల నుంచి పొక్లెయిన్లు, జేసీబీలతో తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పుల మట్టి తరలిస్తున్నారు. గత పది రోజుల నుంచి రోజూ సుమారు 70 నుంచి 100 ట్రాక్టర్ల మట్టిని బయటి ప్రాంతాలకు తోలుతున్నారు. అర్ధరాత్రి మూడు గంటల వరకు మార్కాపురం చెరువుకట్ట రోడ్డుపై మట్టి ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో మట్టిని తరలిస్తున్నాయి. తర్లుపాడు మండలానికి చెందిన ఒక టీడీపీ నేత ఈ అక్రమ బాగోతాన్ని పర్యవేక్షిస్తున్నారు. మట్టితోలే ప్రాంతానికి ఎవరూ రాకుండా డ్రైవర్లనే కాపలాగా ఉంచారు. మార్కాపురం పట్టణ పరిసరాల్లో ఉండే వేములకోట, దరిమడుగు, దేవరాజుగట్టు, రాయవరం, కొండేపల్లి రోడ్డు, అల్లూరిపోలేరమ్మ గుడి, తర్లుపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేశారు. ఈ వెంచర్లను చదును చేసేందుకు మట్టి అవసరం. దీంతో టీడీపీ నేత కనుసన్నల్లో గత పది రోజుల నుంచి మట్టి తోలకం ప్రారంభమైంది. ఒక ట్రాక్టరు మట్టికి రూ.800 నుంచి రూ.1000 రుసుంగా చెల్లించాలని సదరు టీడీపీ నేత ఆదేశాలిచ్చాడు. ఈ విషయం నీటి పారుదల, భూగర్భ గనుల శాఖాధికారులకు తెలిసినప్పటికీ అధికార పార్టీ నేత కావడంతో ఏమీ తెలియనట్టుగా నిద్రనటిస్తున్నారు. చెరువులో మట్టి అక్రమ తవ్వకాల గురించి పలువురు పాత్రికేయులు ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇవ్వగా తమ పరిధి కాదంటూ తప్పుకోవడం విశేషం. తర్లుపాడు మండలంలోని మీర్జపేట, కారుమానిపల్లి చెరువులో కూడా జేసీబీ, పొక్లెయిన్లతో విచ్చలవిడిగా మట్టి తవ్వి అమ్ముకుంటున్నారు. మార్కాపురం చెరువు కింద అధికారికంగా 2 వేల ఎకరాలు, అనధికారికంగా మరో 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులో సారవంతమైన మట్టి వెంచర్లకు తరలిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలని రైతులు కోరుతున్నారు.

ఎవరికీ అనుమతులివ్వలేదు

మార్కాపురం చెరువులో మట్టి తవ్వేందుకు మేమెవరికీ అనుమతి ఇవ్వలేదు. మేము లేనప్పుడు తవ్వకాలు జరుగుతున్నాయేమో కనుక్కుంటాం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాము.

– శ్రీనివాసనాయక్, ఇరిగేషన్ ఏఈ, మార్కాపురం

సౌత్ ఇండియా కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

ఒంగోలు: సౌత్ ఇండియా కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ సౌత్ ఇండియా జోనల్ కరాటే చాంపియన్‌షిప్–2024లో ఒంగోలు సిద్దార్థ కరాటే అకాడమీ విద్యార్థులు నాలుగు పతకాలు సాధించారు. ఈ నెల 17, 18 తేదీల్లో చెన్నైలోని మౌంట్ ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 40 కేజీల పురుషుల విభాగంలో టి.యశ్వంత్ బంగారు పతకం, 76 కేజీల పురుషుల విభాగంలో సీహెచ్ ప్రకాష్ బ్రాంజ్ మెడల్, 67 కేజీల విభాగంలో కె.యశ్వంత్ బ్రాంజ్ మెడల్, 76 కేజీల సీనియర్ పురుషుల విభాగంలో ఎం.రామకృష్ణ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు సిద్దార్థ కరాటే అకాడమీ రాష్ట్ర కోచ్ నల్లూరి మోహన్‌రావు తెలిపారు.

శాస్త్రబద్ధత లేని వర్గీకరణతో దళితుల మధ్య చిచ్చు



మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: శాస్త్రబద్ధత లేని వర్గీకరణ దళితుల మధ్య చిచ్చుకు దారితీస్తుందని రాష్ట్ర దళిత్ రైట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కలు కాకుండా 2024 జనాభా లెక్కలు తీసి ఎస్సీ, ఎస్టీలను శాస్త్రీయబద్ధంగా వర్గీకరించే అంశం సుప్రీం కోర్టు పరిధిలో లేకపోయినప్పటికీ, అలా చేసుకోవచ్చని సుప్రీం సలహాలు ఇవ్వడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో ఆర్టికల్ 341 క్లాజ్ 3ని రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే మార్చాలన్నారు. క్రీమిలేయర్‌తో దళితులను విద్యాఉద్యోగాలకు పూర్తిగా దూరం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యే పదవులు ఇవ్వడానికి సామాజిక న్యాయం గుర్తుకు రాదా అని ప్రశ్నించారు. ఎస్సీలను విద్య, ఉద్యోగాలకు దూరం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదంలో మృతి చెందిన సింగయ్య

టంగుటూరు: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో అక్కడికక్కడే ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం టంగుటూరు మండలం కొణిజేడు గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు ఒంగోలుకు చెందిన అరుగురు కొణిజేడు గ్రామంలో అంకమ్మతల్లి కొలుపులకని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా కొణిజేడు గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. మేకబోయిన సింగయ్య(46) ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి ప్రమాదంపై, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పున్నారావు తెలిపారు.

'ఆయ్'.. హిట్టయ్యిందండి'



ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న నార్నె నితిన్

ఒంగోలు టౌన్: వినూత్న కథాంశంతో, విభిన్నమైన కథనంతో వచ్చిన ఆయ్ సూపర్ హిట్టయ్యిందని, ఇంతటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు చెప్పుకునేందుకు వచ్చామని దర్శకుడు కంచిపల్లి అంజి పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని రవిప్రియ మాల్‌లో 'ఆయ్' చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర హీరో, హీరోయిన్లు నార్నె నితిన్, సారికను అభిమానులు చుట్టుముట్టి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. 'ఆయ్' విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లను చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి సందర్శిస్తున్నామని తెలిపారు. ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరాభిమానాలు మరచిపోలేమన్నారు. కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆయ్ కొత్త ట్రెండ్ సృష్టించిందని, కుటుంబ సమేతంగా ఈ సినిమా చూసి ఆనందించవచ్చని చెప్పారు. అనంతరం రవిప్రియ మాల్ 6వ వార్షికోత్సవ పోస్టర్‌ను చిత్ర యూనిట్ ఆవిష్కరించింది.